చంద్రబాబు సంపద సృష్టి అంతా మాయ

నందిగామరూరల్: తనకు అధికారం ఇస్తే సంపద సృష్టించి ప్రజలకు పంచుతానంటూ హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు, ఈ ఏడాది పాలనలో సృష్టించిన సంపద ఎంతో చెప్పాలని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై నందిగామ మండల నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ చంద్రబాబు సంపద సృష్టి అంతా ఓ మాయ అని, సంపద సృష్టిస్తే ఈ ఏడాది కాలంలో ఆయన సుమారు రూ.2లక్షల కోట్లు అప్పులు ఎందుకు చేయాల్సి వచ్చిందో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇసుక, మట్టి అక్రమరవాణా ద్వారా సృష్టించే సంపద అంతా ఆపార్టీ నాయకులు, కార్యకర్తల కోసమే తప్ప సామాన్య ప్రజల కోసం కాదని విమర్శించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అన్యాయం, అక్రమం, రాజ్యాంగ ఉల్లంఘనలతో కూడిన రెడ్‌బుక్ పాలన తప్ప పారదర్శక పాలన కనిపించడం లేదన్నారు. అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఎన్నికలకు ముందు ఇష్టారీతిన హామీలు ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక ఆయా హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు.

సంస్కరణలకు సమాధి..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో తీసుకొచ్చిన సంస్కరణలను కూటమి ప్రభుత్వం సమాధి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ఆరోపించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి కల్పనలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిన వైనాన్ని గుర్తుచేశారు. కూటమి నేతలు అధికారంలోకి సంక్షేమ పథకాల ఊసెత్తడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడంతోపాటు రానురాను ప్రజల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక అక్రమకేసులు, అరెస్టుల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కూటమి యత్నిస్తోందని ఆరోపించారు.



"బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ జగన్‌మోహనరావు, నాయకులు



మాట్లాడుతున్న నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



గండ్రాయిలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

ఒక్క సిక్స్ కొట్టని కూటమి..

ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీల్లో ఏడాది గడిచినా కూటమి ప్రభుత్వం నేటికీ ఒక్క సిక్స్‌ను కూడా కొట్టలేకపోయిందంటూ ఎద్దేవా చేశారు. హామీలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని గ్రామాల్లోని ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. రానున్న ఎన్నికలలో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ శక్తి వంచన లేకుండా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెసరమల్లి రమాదేవి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మంగునూరు కొండారెడ్డి, మండల, పట్టణ కన్వీనర్లు మంచాల చంద్రశేఖర్, మహ్మద్‌మస్తాన్, జిల్లా అధికార ప్రతినిధి నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు రామిరెడ్డి సీతయ్య, పెసరమల్లి సురేష్, చిలుకూరి బుచ్చిరెడ్డి, రవికిరణ్‌రెడ్డి, గర్మిడి వీరభద్రయ్య, ఐలపోగు రామయ్య, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాల అమలుకు డిమాండ్

జగ్గయ్యపేట: మండలంలోని మల్కాపురం, గండ్రాయి గ్రామాల్లో శుక్రవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట మండల కన్వీనర్ బూడిద నరసింహారావు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వహయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రమం తప్పకుండా పథకాలు అమలుచేయగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆయా పథకాలను అటకెక్కించిందన్నారు.దీంతో ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా సీఎం చంద్రబాబు తననైజాన్ని మరోసారి చాటుకుంటున్నారని విమర్శించారు. సూపర్‌సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలుచేయాలని డిమాండ్ చేశారు. తొలుత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామకన్వీనర్ దమ్మలపాడు సత్యనారాయణ, నాయకులు చల్లా సుశీల, దారావత్‌శ్యామల, కాసర్లగడ్డ సీతమ్మ, గడ్డం రామకృష్ణ, కోటేశ్వరరావు, పాల్వంచ రమేష్‌బాబు, పుల్లంశెట్టి పద్మ, బండి రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీపై కేసులో 41ఏ ప్రొసీజర్‌ను అనుసరించాలి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

నందిగామటౌన్: కంచికచర్ల ఓసీ క్లబ్‌లో ఈనెల 13న నిర్వహించిన 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ రెచ్చగొట్టేలా వ్యాఖ్యానించారంటూ ఆయనపై కంచికచర్ల పోలీసులు నమోదు చేసిన కేసులో 41ఏ ప్రొసీజర్‌ను అనుసరించాలని హైకోర్టు ఆదేశించినట్లు న్యాయవాది వెలది సాయి శ్రీహర్ష శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ సమావేశంలో ఎమ్మెల్సీ అరుణకుమార్ ప్రజలను రెచ్చగొట్టేలా, టీడీపీ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురయ్యేలా మాట్లాడారంటూ కంచికచర్ల పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. దీంతో ఎమ్మెల్సీ అరుణకుమార్ తరపున హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా కేసుకు సంబంధించి ఎటువంటి అరెస్టులు చేయకుండా 41ఏ ప్రొసీజర్‌ను అనుసరించడంతోపాటు దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించినట్లు తెలిపారు.

ఎనిమిది కేజీల గంజాయి స్వాధీనం

ఓ మహిళ, మరో ఇద్దరి అరెస్ట్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...జగ్గయ్యపేట మండలంలోని గౌరవరం గ్రామం లింగగూడెం వెళ్లే రహదారిలో గురువారం అర్ధరాత్రి పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా జగ్గయ్యపేటకు చెందిన షేక్ నవాజ్ షరీఫ్, కంచికచర్ల మండలం కీసరకు చెందిన కుంకా చిన్ను అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించి వారి వద్ద నుంచి 4కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరు ఇచ్చిన సమాచారం మేరకు కంచికచర్ల మండలం కీసర గ్రామానికి చెందిన కొచ్చెర్ల రాజీ అనే మహిళ వద్ద నుంచి మరో 4కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరికి ఒరిస్సా నుంచి గంజాయి సరఫరా అవుతున్నట్లు గుర్తించామన్నారు. నిందితులు ముగ్గురిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ తెలిపారు.

సుజినీకుమార్ కుటుంబానికి పరామర్శ



కంచికచర్ల: అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తంగిరాల సుజినీకుమార్(40) మృతదేహాన్ని మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సందర్శించి నివాళులర్పించారు. సుజినీకుమార్ కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈసందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ సుజినీకుమార్ బతికి ఉన్నంతకాలం పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు మంచి సైనికుడిలా పనిచేశారన్నారు. సుజినీకుమార్ మృతి పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సుజినీకుమార్‌కు నివాళులర్పించిన వారిలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, నాయకులు అమర్లపూడి యోహాన్, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు, బర్రె ఉదయ్‌కిరణ్, ప్రముఖ కవి తంగిరాల సోనీ, వేల్పుల రమేష్, మాడుగుల శంకర్, కేవీ విద్యాసంస్థల అధినేత కేవీ కృష్ణారావు, మేకల బాబు తదితరులు ఉన్నారు.

బైక్ దొంగలకు రిమాండ్

పెనుగంచిప్రోలు: బైక్‌లను అపహరిస్తున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..ఈనెల 10న శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద పి.అర్జునరావు బైక్ ఉంచి ఆలయంలోకి వెళ్లి వచ్చే సరికి బైక్ కనిపించకపోవటంతో 18వ తేదీన ఫిర్యాదు చేశాడు. మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన పి.గోపి ఈనెల 13వ తేదీన బైక్ కనిపించటం లేదంటూ 22న ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పెనుగంచిప్రోలు పోలీసులు పల్నాడు జిల్లాకు చెందిన తురక రామయ్య, కంచల రమణయ్య అనే ఇద్దరు వ్యక్తులు ఈ బైక్‌లను అపహరించినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని వారినుంచి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారిద్దరికీ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వివరించారు.

డివిజన్‌లో 60.2 మి.మీ వర్షపాతం

కంచికచర్ల: నందిగామ డివిజన్‌లోని శుక్రవారం 60.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కంచికచర్లలో 5.4మిల్లీమీటర్లు, నందిగామలో 2.8, చందర్లపాడులో 8.4, వీరులపాడులో 7.0, జగ్గయ్యపేటలో 6.6, పెనుగంచిప్రోలులో 13.6, వత్సవాయి మండలంలో అత్యధికంగా 16.5మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వివరించారు.ఎగువ ప్రాంతంలో కూడా వర్షం కురుస్తుండటంతో కంచికచర్ల మండలంలోని కీసర వద్ద మునేరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

రిజర్వేషన్ల అమలు కోరుతూ వినతి



జగ్గయ్యపేట అర్బన్: రెండేళ్ల కిందట 2023లో ఇచ్చిన జీవో నంబర్ 43 ప్రకారం దివ్యాంగులకు రిజర్వేషన్లను అమలుచేయాలని నియోజకవర్గ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు వడ్డేపూడి ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తులసి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కాంప్లెక్స్‌లోని షాపుల కేటాయింపు, ఒప్పంద ఉద్యోగుల ఎంపికలో దివ్యాంగులకు ఐదుశాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

నందిగామటౌన్: మండలం కీసర గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని పసుమర్తి కారుణ్యకు శుక్రవారం ఆశాజ్యోతి ఫౌండేషన్ సభ్యులు రూ.12వేలను ఆర్థికసాయంగా అందజేశారు. మహంకాళి విజయకుమార్, సునీత, తేజస్, శ్రేష్ఠ సహకారంతో ఆర్థికసాయం అందించినట్లు ఆర్యవైశ్య సంఘ నాయకులు తెలిపారు. నాయకులు చవట నాగేశ్వరరావు, పారేపల్లి సాయిబాబు, వనమా నరసింహారావు, మారం వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకుంటేనే ఉపాధి అవకాశాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కాలేజీ కరస్పాండెంట్ రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్

కంచికచర్ల: విద్యార్థులు ఆయా కోర్సులను పూర్తిచేయడంతోపాటు నైపుణ్యాలను పెంచుకుంటేనే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కే రామ్మోహనరావు పేర్కొన్నారు. కళాశాలలో పాలిటెక్నిక్ ఫస్టియర్ క్లాసులను శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులకు కేంబ్రిడ్జి ఇంగ్లిష్ అప్లికేషన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, ఈ యాప్ ద్వారా ఆంగ్లభాషా నైపుణ్యం పెంచుకోవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు వెంటనే ప్రభుత్వ, ప్రవేటు రంగాల్లో మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. గతేడాది 100మంది విద్యార్థులకు ట్రెనింగ్ ఇవ్వగా వారంతా ఉద్యోగాలు సాధించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆటో, లారీ ఢీ- ఐదుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన లారీ, ఆటో

నందిగామరూరల్: లారీని ఢీకొట్టి ఆటోబోల్తా కొట్టిన ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఓ ఆటో ప్రయాణికులతో నందిగామ నుంచి చందర్లపాడు మండలం రామన్నపేటకు వెళ్తోంది. ఈక్రమంలో మండలంలోని అడవిరావులపాడు గ్రామ సమీపంలోకి వెళ్లే సరికి రామన్నపేట వైపు నుంచి ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో లారీ వెనుకభాగం తగలడంతో ఆటో బోల్తా పడింది. ఈఘటనలో ఆటోలో ఉన్న రామన్నపేట గ్రామానికి చెందిన మందలపు వెంకట నారాయణ, లక్ష్మీపురం గ్రామానికి చెందిన సూర్య వెంకట నరసయ్య, చందర్లపాడు గ్రామానికి చెందిన గొట్టిముక్కల మంగమ్మ, నందిగామకు చెందిన పాదిలి రవితోపాటు మరొకరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో తీవ్రంగా గాయపడిన మందలపు వెంకట నారాయణను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు..

నందిగామటౌన్: పట్టణంలోని అశోక్‌నగర్ సమీపంలోని జాతీయ రహదారిపై ఓ ద్విచక్ర వాహనం బస్సును ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. అశోక్‌నగర్‌లోని పెట్రోల్ బంకులో పని చేసే ముక్కపాటి కాలనీకి చెందిన నారాయణ శుక్రవారం ఉదయం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న క్రేన్, ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో బస్సుకు తగిలి కిందపడ్డాడు. ఈ ఘటనలో నారాయణకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం అతన్ని విజయవాడకు తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభ చూపిన పేట క్రీడాకారులు



బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

జగ్గయ్యపేటఅర్బన్: ఇటీవల నిర్వహించిన ఉమ్మడి కృష్ణాజిల్లా అండర్-19 బ్యాడ్మింటన్ పోటీలో పేట క్రీడాకారులు విశేష ప్రతిభను కనబరిచారు. విజయవాడలోని చెన్నుపాటి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో బాలుర విభాగంలో ఎస్.నటరాజ్, బాలికల విభాగంలో బి.కార్తీష గోల్డ్‌మెడల్ సాధించారు. అండర్-11 డబుల్స్‌లో సీహెచ్.కోవిద్, కేతేశ్వర్ బ్రాంజ్ మెడల్, అండర్-15 విభాగంలో కె.చరణ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. ఖమ్మం జిల్లాలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన పోటీలో టి.నదియా సిల్వర్ మెడల్, నల్గొండ జిల్లాలోని కోదాడలో ఈఆర్ఎస్ స్టేడియంలో జరిగిన పోటీలో అండర్-11 బాలుర విభాగంలో సాత్విక్ సాయి(కేసీపీ) గోల్డ్‌మెడల్, బాలికల విభాగంలో ఎం.వర్షిత సిల్వర్ మెడల్ సాధించారు. క్రీడాకారిణి కె.రమ్య స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించే సర్టిఫికెట్ కోర్సు(ఎన్ఐఎస్)కు ఎంపికై విజయవంతంగా పూర్తిచేసింది. వీరంతా శుక్రవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలువగా, ఆయన క్రీడాకారులతోపాటు కోచ్ కె.గోపిని అభినందించారు. కౌన్సిలర్ ఇర్రి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో మనోజ్

వీరులపాడు: మండలంలోని పొన్నవరంలోని ఏకత్వా పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే మోడ్రన్ పెంటాథలన్ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ఫౌండర్, డైరెక్టర్ అమరనేని మనోజ్ తెలిపారు. ఈనెల 26,27న విజయవాడలో జరగనున్న తొమ్మిదవ అంతర్ జిల్లాల మోడరన్ పెంటాథలన్ పోటీల్లో తమ విద్యార్థులు జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులతోపాటు పీఈటీ విజయ్‌కుమార్‌ను ఆయన అభినందించారు.

బాధ్యతల స్వీకారం



గురునాథం

కంచికచర్ల : మండల విద్యాశాఖాధికారి-1గా ఉప్పులూరి గురునాథం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఆదూరి వెంకటరత్నం జీ కొండూరు మండలానికి బదిలీకాగా, ఆస్థానంలో గురునాథం బాధ్యతలు స్వీకరించారు. కంచికచర్ల జెడ్పీ పాఠశాలలో విద్యనభ్యసించిన తాను ఇదే మండలంలో ఎంఈఓగా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని గురునాథం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చొరవ తీసుకుంటానని వివరించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



పేట: స్వర్ణరజిత కవచాలంకరణలో అమ్మవారు



ప్రత్యేకాలంకరణలో పల్లగిరి త్రిశక్తి పీఠంలోని అమ్మవార్లు



జగ్గయ్యపేటలోని వెండి దేవాలయంలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

జగ్గయ్యపేటఅర్బన్: శ్రావణమాస తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని జగ్గయ్యపేటలోని ఆయా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండిదేవాలయం, నకాశీబజారులోని శ్రీకనకదుర్గ, దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి, శ్రీరంగనాయకస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీ ఆండాళ్ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకనకదుర్గ అమ్మవారికి స్వర్ణరజిత కవచాలంకరణ చేశారు. మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ మైన్స్ క్వార్టర్స్ వద్ద ఉన్న నాగసత్యమ్మ ఆలయంలో అమ్మవారికి గాజులతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. దుర్గాపురంలోని శ్రీబ్రాహ్మణ ఎల్లమ్మతల్లి అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా వెండిదేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రైవేటు ఇంఫ్రూమ్‌మెంటు కమిటీ సభ్యులు, దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయాలలో శ్రావణ శోభ..

నందిగామరూరల్: శ్రావణమాస తొలి శుక్రవారం సందర్భంగా నందిగామ మండలంలోని పల్లగిరి గట్టుపై త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న కనకమహాలక్ష్మి, కనకదుర్గ, జ్ఞానసరస్వతీ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు, మూలమంత్ర హోమాది క్రతువులను వేదోక్తంగా జరిపించారు. భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. మాగల్లులోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మీ అమ్మవారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

నందిగామ పట్టణంలో..

నందిగామటౌన్: పట్టణంలోని పలు దేవీ ఆలయాల్లో శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మరిడీ మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేకాలంకరణ, కుంకుమార్చన పూజలు చేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారిని గజలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, పూలు పంపిణీ చేశారు.

కంచికచర్లలో..

కంచికచర్ల: శ్రావణమాస శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసంలో ప్రతిరోజూ ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు కాకాని పవన్‌కుమార్ బాబీ తెలిపారు. అమ్మవారిని రాత్రి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.

చికిత్స పొందుతున్న మహిళా రైతు మృతి

వీరులపాడు: పొలంలో పనిచేస్తూ పాముకాటుకు గురై చికిత్సపొందుతున్న మహిళా రైతు శుక్రవారం మృతిచెందారు. వివరాల్లోకి వెళితే మండలంలోని జయంతి గ్రామానికి చెందిన మహిళా రైతు తాటి అలీమా (45) కొంతభూమిని కౌలుకు తీసుకుని కూరగాయల సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 20న మధ్యాహ్న సమయంలో భర్తతో కలిసి పొలంలో పనిచేస్తుండగా పాము కాటుకు గురైంది. దీంతో ఆమెను విజయవాడ తరలించగా, చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ చెప్పారు.

వృద్ధుడు అదృశ్యం

కంచికచర్ల: ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బోనగిరి రాజు శుక్రవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు మోగులూరు గ్రామానికి చెందిన వృద్ధుడు కూసు పుల్లయ్య(75) ఈనెల 24న బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. కుటుంబసభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో ఆయన కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేటలో న్యాయవాదుల ధర్నా



పేటలో ధర్నా చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేటఅర్బన్: న్యాయవాదుల ప్రొటెక్షన్ యాక్ట్‌ను తక్షణమే అమలు చేయాలని కోరుతూ జగ్గయ్యపేట న్యాయవాదులు శుక్రవారం ధర్నా చేశారు. కోర్టు బయట తమ డిమాండ్లతో కూడిన పోస్టర్‌ను ప్రదర్శించారు. సీనియర్ న్యాయవాది ఈవీ.జగన్నాథరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో వారు మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేలు స్టైఫండ్ ఇవ్వాలని కోరారు. న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్ రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ తమ సహేతుక డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు బద్దుల వెంకట్రామయ్య, పసుపులేటి సత్యశ్రీనివాసరావు, దామాల సంతోష్, ఎం.కృష్ణయ్య, గోనెల వెంకటేశ్వర్లు, శ్రీనివాసగౌడ్, గురువులు రాజు, రావూరి ప్రసాద్, శేషకుమారి తదితరులు పాల్గొన్నారు.

పేట ఏఎంసీ చైర్మన్ పదవి ఎస్సీ మహిళకే

హైకోర్టు ఆదేశం

జగ్గయ్యపేట: వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవిని ఎస్సీ మహిళలకే కేటాయించాలని హైకోర్టు ఆదేశించింది. గతంలో ఎస్సీ మహిళకు కేటాయించి ఆ తరువాత ఓసీలకు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో జగ్గయ్యపేటకు చెందిన కోట ఇందిర అనే మహిళ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 2019లో అప్పటి ప్రభుత్వం తీసుకువచ్చిన 50శాతం రిజర్వేషన్ ప్రక్రియలో భాగంగా ఎస్సీ మహిళకే కేటాయించాలని కోరుతూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు గతంలో ఇచ్చిన మాదిరిగానే ఎస్సీ మహిళలకే చైర్మన్ పదవిని ఇవ్వాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్ పదవిని కూటమి ప్రభుత్వం ఎస్సీ మహిళలకే కేటాయిస్తుందో? లేక కాలయాపన చేస్తుందోనని రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది.

కౌలువేలం నిర్వహణ



కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

జగ్గయ్యపేటఅర్బన్: తిరుమలగిరిలో ఉన్న 9.30ఎకరాల వక్ఫ్‌బోర్డుకు చెందిన దర్గా హజరత్ దావుస్వవలి భూములకు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మనోహర్ అధ్యక్షతన కౌలువేలం నిర్వహించారు. వేలంలో ఆరుగురు పాల్గొనగా, వారిలో సిరాఉద్దీన్ అనేవ్యక్తి ఏడాది కాలానికి రూ 2.13లక్షలు చెల్లించేందుకు ఆసక్తిచూపడంతో ఆయనకు కౌలుకు ఇచ్చేలా నిర్ణయించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎండీ నూహ్ ఆలీషా, సిబ్బంది మహ్మద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.